## క్లుప్తంగా

### ఘనంగా రామకోటి యజ్ఞం

గుర్రంకొండ: మండలకేంద్రమైన గుర్రంకొండలో రామకోటి యజ్ఞాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక శ్రీవోనిఆంజినేయస్వామి ఆలయంలో మంగళవారం వేకువజాము నుంచి రామకోటి యజ్ఞం ప్రారంభించారు. పౌర్ణమిపూజల్లో భాగంగా ఆలయంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. 24 గంటల పాటు నిరంతరంగా రామనామ జపాన్ని జపించారు. ఈసందర్భంగా ఆలయంలో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. మండలం నలుమూలల నుండి భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి తరలివచ్చి రామకోటి కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆంజినేయస్వామి మాలధారణ గురువులు శ్రీనివాసులు, పెద్దరెడ్డెప్ప, మల్లయ్య, నిర్వాహకులు పాల్గొన్నారు.

### వైభవంగా కదిరి పౌర్ణమి వేడుకలు

మదనపల్లె సిటీ: మదనపల్లె పట్టణం శ్రీవారినగర్‌లోని శ్రీ అభయ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మంగళవారం కదిరి పౌర్ణమి వేడుకలు వైభవంగా జరిగాయి. ఆలయ నిర్వాహకులు రమేష్‌స్వామి ఆధ్వర్యంలో పూజలు చేశారు. ఉదయం పంచామృతాభిషేకం చేసి ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. స్థానిక బీటీ కాలేజీ మైదానం వద్దనున్న వరాల ఆంజనేయ స్వామి ఆలయం, కోటవీధిలోని శ్రీషిర్డి సాయిబాబా ఆలయంలో లక్ష్మీనరసింహ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు.

### టమాటా తోట ధ్వంసం

పెద్దమండ్యం: తొలికోత చేతికి వచ్చే సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు టమాటా తోటను ధ్వంసం చేశారని ఓ రైతు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని బండ్రేవు పంచాయతీ కేతిరెడ్డిగారిపల్లెకు చెందిన సిద్దారెడ్డి పంటలు సాగుచేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఎకరం భూమిలో రెండు నెలల క్రితం టమాటా పంటను బిందు సేద్యం ద్వారా సాగుచేశాడు. పంట తొలకోత దశకు వచ్చింది. సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు టమాటా పంటను ధ్వంసం చేశారు. బిందు సేద్యం పరికరాలను కొడవళితో కోశారు. చేతికి వచ్చి పంటను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారని బాధిత రైతు వాపోయాడు. రూ. 2 లక్షల ఆస్తినష్టం జరిగినట్లు రైతు ఆవేదన వ్యక్తం చేశారు.

### సారా విక్రేత అరెస్టు

పీలేరు రూరల్ : మండలంలో 25 సారా ప్యాకెట్లు తోపాటు ఓ నిందితున్ని అరెస్ట్ చేసినట్లు పీలేరు సెబ్ సీఐ వై. గురుప్రసాద్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని మోడల్ కాలనీలో సారా విక్రయాలు జరుగుతున్నట్లు అందిన సమాచారంతో మంగళవారం దాడి చేశారు. ఈ సందర్భంగా కాలనీకి చెందిన జి. శ్రీరాములు 25 సారా ప్యాకెట్లు కలిగి ఉండగా అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు.

### నవోదయలో వైద్య శిబిరం

మదనపల్లె సిటీ: స్థానిక చిత్తూరు రోడ్డులోని జవహర్ నవోదయ విద్యాలయంలో మంగళవారం వైద్య శిబిరం జరిగింది. సీటీఎం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సునిత విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్య విషయాలపై విద్యార్థులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పద్మావతి, హెల్త్ ఎడ్యుకేటర్ సత్యనారాయణ, డీపీఎంఓ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

### శెట్టిపల్లెలో అగ్నిప్రమాదం

బి.కొత్తకోట: నగర పంచాయతీ పరిధిలోని శెట్టిపల్లెకి చెందిన రైతు రమేష్‌రెడ్డి పోలంలో మంగళవారం అగ్నిప్రమాదం జరిగింది. రమేష్‌రెడ్డి పొలానికి దూరంగా వ్యాపించిన మంటలు అంటుకుని ప్రమాదం జరిగి ఉంటుందని భావిస్తున్నారు. ఈ ప్రమాదంలో రూ.80వేలు విలువైన గడ్డివామి, బోరు స్టార్టర్, కేసింగ్‌పైపులు, డ్రిప్‌పరికరాలు, పీవీసీ పైపులు కాలిపోయాయి.

### ఉత్తమ విద్యతోనే ఉన్నత శిఖరాలు

కలకడ : ఉత్తమ విద్యతోనే ఉన్నత శిఖరాలు అధిరోహించడం సాధ్యమని ఎంపీడీఓ నారాయణ అన్నారు. మంగవారం స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాల, ఆదర్శ పాఠశాలలో 10వతరగతి విద్యార్థినులకు ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని ప్రసంగించారు. ఎంఈఓ మునీంద్రనాయక్, పాఠశాల కమిటీ అధ్యక్షుడు, సభ్యులు కెఎస్ మస్తాన్, సుందరబాబు, ప్రిన్సిపాల్ మల్లంగ్‌షావలి పాల్గొన్నారు.

### కూలీల సంఖ్య పెంచకుంటే చర్యలు



ఉపాధి పనులను తనిఖీ చేస్తున్న ఏపీడీ

పెద్దతిప్పసముద్రం: ఉపాధి హామీ పథకంలో కూలీల సంఖ్య పెంచకుంటే చర్యలు తప్పవని డ్వామా క్లస్టర్ ఏపీడీ నందకుమార్‌రెడ్డి సిబ్బందిని హెచ్చరించారు. మంగళవారం ఆయన మండలంలోని మడుమూరు పంచాయతిలో చేపడుతున్న పనులను తనిఖీ చేసి కూలీల కనీస సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం ఉపాధి కార్యాలయంలో సిబ్బందితో సమీక్షించారు. కొంత మంది క్షేత్ర స్థాయి సిబ్బంది విధుల పట్ల అలసత్వం వహిస్తున్నారని, ప్రభుత్వ లక్ష్యాలను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలన్నారు.

# దివ్యమైన సంకల్పం



వెలుగు ప్రత్యేక పాఠశాల విద్యార్థులతో కన్వీనర్ భాగ్యలక్ష్మి



వృద్ధులతో భాగ్యలక్ష్మి

- దివ్యాంగులకు ఆలనా పాలనా
- వెలుగు ప్రత్యేక పాఠశాల, వృద్ధాశ్రమంలో భాగ్యలక్ష్మి సేవలు

మదనపల్లె సిటీ: ఒకరిద్దరు పిల్లలతోనే వేగలేక సతమతమయ్యే తల్లిదండ్రులను చూస్తున్న నేటి సమాజంలో వందల సంఖ్యలో మానసిక దివ్యాంగులతో ఉండటం, వారి ఆలనా పాలనా చూడటం సాధారణ విషయం కాదు. ఇదే చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు మదనపల్లె పట్టణం అమ్మచెరువుమిట్టవద్దనున్న వెలుగు ప్రత్యేక పాఠశాల కన్వీనర్ భాగ్యలక్ష్మి. 1997లో మానసిక దివ్యాంగుల కోసం వెలుగు ప్రత్యేక పాఠశాలను పద్మజ ఏర్పాటు చేశారు. పద్మజ అనారోగ్యంతో మృతి చెందడంతో పాఠశాల బాధ్యతలను 2004లో భాగ్యలక్ష్మి చేపట్టారు. పాఠశాలలో 130 మంది దివ్యాంగుల పిల్లలున్నారు. మానసిక వికలాంగులతో కలిసిపోయి, వారికి సేవ చేస్తూ అక్కడి పరిస్థితులకు అలవాటు పడిపోయారు. పాఠశాలలో విద్యార్థుల బోధన, ఇతర విషయాలను స్వయంగా చూసుకుంటుంది.

విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ, వృత్తి విద్యా కోర్సులు నేర్పించడం నిర్వహిస్తున్నారు. ఎంతో మంది విద్యార్థులు వృత్తి విద్యా కోర్సుల్లో రాణిస్తున్నారు. దివ్యాంగులకు ట్రై సైకిళ్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. దీంతో పాటు పాఠశాలలో వృద్ధాశ్రమం ఏర్పాటు చేశారు. ఇందులో సుమారు 50 మంది ఉన్నారు. వీరికి ఉదయం ,సాయంత్రం ప్రత్యేక తరగతులను చెబుతున్నారు. వారిలో ఆత్మస్థైర్యం నింపుతున్నారు.

ఎవరూ లేకున్నా తామున్నామని భరోసా కల్పిస్తున్నారు. ఆమెకు జిల్లా స్థాయిలో ఎన్నో అవార్డులు అందుకున్నారు. దివ్యాంగుల విద్యార్థులు, వృద్ధులకు సేవ చేయడంతో ఎంతో ఆనందంగా ఉందని భాగ్యలక్ష్మి చెబుతున్నారు.

# తండ్రి వారసత్వమే జీవనాధారంగా...



రెగ్జిన్ కుట్టు పనిలో నిమగ్నమైన అనూరాధ

- ఆదర్శంగా నిలుస్తున్న టైలర్ అనూరాధ
- వాహనాలకు రెగ్జిన్ కుట్టుటలో దిట్ట
- మరో నలుగురికి ఉపాధి
- తక్కువ ధరకే నాణ్యమైన వస్తువులు





పీలేరు రూరల్ : మహిళలకే కాదు పురుషులకు ఆదర్శం రెగ్జిన్ టైలర్ అనూరాధ. పలు రకాల వాహనాల టాప్‌లు, సీట్ కవర్లు అందంగా రెగ్జిన్ తయారు చేసి పీలేరు పట్టణంలో ఎంతో పేరుతెచ్చుకున్న అనూరాధ పలువురికి ఆదర్శంగా నిలిచింది. పట్టణంలోని చిత్తూరు రోడ్డులో రెగ్జిన్ షాపు నిర్వహిస్తున్న అనూరాధ స్వగ్రామం చిత్తూరు. ఆమె తండ్రి హరినాథ్ దగ్గర నుంచి వారసత్వంగా నేర్చుకున్న కుట్టుపనే తన కుటుంబానికి జీవనాధారం ఎందుకు కాకూడదని ప్రయత్నించిన ఆమె సఫలీకృతులయ్యారు. హరినాథ్‌కు ఆరుగురు ఆడపిల్లలు. వారిలో ద్వితీయ సంతానం అయిన అనూరాధను గుర్రంకొండ మండలం నడిమికండ్రిగ గ్రామంలోని శివరామకృష్ణకు ఇచ్చి వివాహం చేశారు. అయితే భర్త పీలేరులోని ఒక ప్రయివేటు పెట్రోల్ బంక్‌లో దినసరికూలీగా పని చేస్తున్న సమయంలో కూలీ కుటుంబ పోషనకు సరిపోయేది కాదు. దీంతో తన చేతిలోని పనిపై మక్కువ చూపిన అనూరాధ 1992లో పీలేరులో జర్కిన్ కుట్టుమిషన్ ప్రారంభించింది. పట్టణంలోని జీపులు, ఆటోలు, ద్విచక్రవాహనాలు, లారీలకు సైతం ముసుగులు వేయాలంటే మొదట గుర్తుకు వచ్చేది 'అక్క' అనూరాధ మాత్రమే అని చెప్పుకుంటారు. ఎలాంటి వాహనాలకైనా, ఇంట్లో వస్తువులకైనా అందంగా డిజైన్ చేసి తయారు చేయడంలో మంచి దిట్ట. కేవలం పదవ తరగతి వరకు చదువుకున్న ఆమె తన పిల్లలు మాత్రం ఉన్నత విద్య అందించాలని కుమారుడు జీవన్‌సాయి, కుమార్తె తనూజను బీటెక్ చదివించింది. కుమార్తెకు వివాహం చేసింది. కుమారుడు చెన్నైలో జాబ్ చేస్తున్నాడు. ఏడాది క్రితం భర్త శివరామకృష్ణ మృతి చెందాడు. పీలేరులో 30 సంవత్సరాలుగా వాహనాలకు రెగ్జిన్ కుట్టడంతో మంచిపేరు సంపాదించడంతోపాటు తన ద్వారా మరో నలుగురికి ఉపాధిని కల్పించుతోంది. పీలేరులోనేగాక చుట్టుప్రక్కల మండలాల నుంచి అనేక మంది అనూరాధ వద్ద నాణ్యమైన వస్తువులు తక్కువ ధరలకు లభిస్తాయని పేరుతెచ్చుకుంది. తనకు అవసరమైన మెటీరియల్‌ను భర్త సహాయంతో కర్నాటక, చెన్నై, మహారాష్ట్ర నుంచి ఆర్డర్‌పై తెప్పించుకుని కుటుంబ పోషణకు అవసరమైన ఆదాయం ఇతరులపై ఆదార పడకుండా జీవనం సాగిస్తోంది. ఇతరులపై ఆధారపడకుండా సొంత పనిలో ఎంతో సంతృప్తి నిస్తుందని ఆమె ఆనందం వ్యక్తం చేసింది. మహిళలు అభివృద్ధి చెందడానికి ప్రభుత్వ రంగసంస్థలు ముందుకు వచ్చి విరివిగా రాయితీ రుణాలు అందించాలని కోరుతోంది.

# రాష్ట్రచరిత్రలో గ్లోబల్ సమ్మిట్ చారిత్రాత్మకం

- ఇన్వెస్టర్ సమ్మిట్‌పై దేశవ్యాప్తంగా చర్చ
- 352 ఒప్పందాలతో రూ.13లక్షల కోట్ల పెట్టుబడులు రికార్డ్
- విజయోత్సవ సంబరాల్లో ఎమ్మెల్యేలు నవాజ్‌బాషా, చింతల రామచంద్రారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే చింతల, నాయకులు

మదనపల్లె/వాల్మీకిపురం : రాష్ట్రానికి పెట్టుబడుల సాధనే లక్ష్యంగా విశాఖలో మార్చి 3, 4వ తేదీల్లో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్ ఆంధ్రప్రదేశ్‌లో 352 ఒప్పందాలతో రూ.13లక్షల కోట్ల పెట్టుబడులు సాధించడం రాష్ట్ర చరిత్రలో చారిత్రాత్మకంగా నిలిచిపోతుందని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. మంగళవారం స్థానిక సీఎస్ఐ కమ్యూనిటీ భవనంలో గ్లోబల్ సమ్మిట్ విజయవంతంపై వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కేక్ కట్‌చేసి వేడుకలు జరిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నవాజ్‌బాషా మాట్లాడుతూ.. గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్‌లో రాష్ట్రంలో పారిశ్రామిక రంగం కోసం సిద్ధంగా ఉన్న వనరులు, అవకాశాలను ప్రపంచానికి చూపించడంలో ముఖ్యమంత్రి సఫలీకృతులయ్యారన్నారు. దేశవ్యాప్తంగా ప్రస్తుతం గ్లోబల్ సమ్మిట్‌పై చర్చ నడుస్తోందని, పెద్ద పెద్ద కార్పొరేట్ దిగ్గజాలైన ముఖేష్ అంబానీ, దాల్మియా, జీఎం.రావు, నవీన్‌జిందాల్ తదితర పారిశ్రామిక వేత్తల దృష్టిని ఆకర్షించి, వారితో రాష్ట్రానికి పెట్టుబడులను సాధించడం ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి దార్శనికతకు నిదర్శనమన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథకంలోకి తీసుకెళ్లేందుకు, వ్యవసాయ, పారిశ్రామిక, విద్యారంగాల్లో సత్తా చాటేందుకు ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి అలుపెరుగని శ్రామికుడిలా పనిచేస్తున్నారన్నారు. గ్లోబల్ సమ్మిట్ సదస్సులో చేసుకున్న ఒప్పందాలతో రాష్ట్రంలోని 6లక్షల మంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. దీనిని ప్రతిపక్షాలు, ఎల్లోమీడియా చిలవలు పలువలుగా చూపిస్తూ, ప్రజలను అసత్య కథనాలతో తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తున్నాయన్నారు. ప్రతిపక్షాల విమర్శలను, కుయుక్తులను తిప్పి కొట్టాల్సిన బాధ్యత నాయకులు, కార్యకర్తలందరిపై ఉందన్నారు. మార్చి 13న జరుగుతున్న గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులు పేర్నాటిశ్యాంప్రసాద్‌రెడ్డి, పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిలను అత్యధిక మెజారిటీతో గెలిపించేందుకు పార్టీ శ్రేణులు కృషిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జింకాచలపతి, నూర్ ఆజం, ఏపీఎండీసీ డైరెక్టర్ ఆనందపార్థసారథి, వెలుగుచంద్ర, సింగిల్‌విండో డైరెక్టర్ దండుకృష్ణారెడ్డి, మార్కెట్‌కమిటీ డైరెక్టర్ తట్టిశ్రీనివాసులురెడ్డి, వైస్ ఎంపీపీ రమణ, వైఎస్సార్ సీపీ డాక్టర్స్ జిల్లా విభాగం అధ్యక్షులు అనిల్‌రెడ్డి, పోతబోలునాగరాజ, మునిశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

**జగన్‌పై నమ్మకంతోనే సమ్మిట్ విజయవంతం**

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో ఏపీ అద్భుతమైన అభివద్ధిని సాధిస్తోందని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. విశాఖలో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో రూ. 13 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు రావడంతో పాటు సమ్మిట్ విజయవంతం కావడం జగన్‌పై ఉన్న నమ్మకమే అన్నారు. సమ్మిట్ విజయవంతం కావడం పురస్కరించుకుని మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో కార్యకర్తలు, నాయకుల సంక్షమంలో ఎమ్మెల్యే చింతల కేక్ కట్ చేసి కార్యకర్తలకు, నాయకులకు పంచిపెట్టి సంబరాలు చేసుకున్నారు.కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యులు చింతల శివానందరెడ్డి, సర్పంచ్ గంగులమ్మ, ఉప సర్పంచ్ బిడ్డల కేశవరెడ్డి, నాయకులు నీళ్ల భాస్కర్, అబ్దుల్ కలీమ్, రవీంద్రారెడ్డి, రాయుడు, రవి, భాస్కర,చంద్రశేఖర్, సైఫుల్లా, ఆనంద, సురేష్ రెడ్డి, మదన్‌మోహన్ రెడ్డి, రమేష్, రాజన్న, రాజబాబు, చలపతి పాల్గొన్నారు.

# ప్రజా సేవ మాది..పదవీకాంక్ష నీది

కలికిరి సర్పంచ్‌పై ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ నేతల ధ్వజం



సర్పంచ్ ఇసుక దందా అధారాలు చూపుతున్న మండల కన్వీనర్ రమేష్ రెడ్డి

కలికిరి: ప్రజా సేవ కోసం తాము పాటు పడుతుంటే.. పదవీకాంక్ష నెరవేరక పార్టీ ఫిరాయించిన ఘనత నీది అని కలికిరి గ్రామ సర్పంచ్‌పై ఎంపీపీ నూర్జహాన్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చింతల రమేష్ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు పద్మజ మండిపడ్డారు. పార్టీ మారుతూ వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులపై కలికిరి సర్పంచ్ ప్రతాప్ రెడ్డి చేసిన అనుచిత వాఖ్యలు చేయడంపై మంగళవారం వైఎస్సార్‌సీపీ నేతలు విలేకరులతో మాట్లాడారు. మండల ఎంపీపీ పదవి ఇవ్వలేదని పార్టీ ఫిరాయించిన ఆయన ఏపీఎండీసీ డైరెక్టర్ హరీష్ రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిలను విమర్శించడంపై మండిపడ్డారు. మండలంలో ఇసుక దందా దగ్గరుండి నడిపించి అక్రమ వసూళ్ళకు పాల్పడిన ఘటనపై అప్పట్లోనే కేసు నమోదైందని, తన అక్రమాలను సాగనీయక పోవడంతోనే పార్టీని వీడి అనవసర ఆరోపణలు చేయడం ఆయనకే చెల్లించదని దుయ్యబట్టారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక ఆహ్వానితులు రత్నశేఖర్‌రెడ్డి, శివాజీ, సర్పంచ్ వెంకటరెడ్డి, సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్ సతీష్ రెడ్డి, వైస్ సర్పంచ్ నూరిన్నిషా, ఎస్టీడి హరి, మధుసూదన్‌రెడ్డి, బావాజీ, ఫయాజ్, సచివాలయాల మండల కన్వీనర్ రెడ్డెప్ప, రఘు, అజయ్, విశ్వనాథ్, ఖాదర్‌వల్లి, నూర్‌మొహమ్మద్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్ల పరిశీలన



ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై ఆర్డీఓ మురళికి సూచనలిస్తున్న కలెక్టర్ పీఎస్.గిరీషా

మదనపల్లె : ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి పోలింగ్, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో అన్ని సదుపాయాలు కల్పించాలని, ఏర్పాట్లు త్వరితగతిన పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ పీఎస్.గిరీషా అధికారులను ఆదేశించారు. మదనపల్లి జెడ్పీ హైస్కూల్‌లో రెవెన్యూ డివిజన్ పరిధిలో ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు రిసెప్షన్, డిస్ట్రిబ్యూషన్ సెంటర్, స్ట్రాంగ్‌రూమ్‌ను తనిఖీ చేశారు. బ్యాలెట్ బాక్సుల పనితీరును పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల నియోజకవర్గ శాసనమండలి ఎన్నికల్లో జిల్లాకు చెందిన పీలేరు, తంబళ్లపల్లె, మదనపల్లె నియోజకవర్గాలకు పట్టణంలోని జెడ్పీ హైస్కూల్ కేంద్రంగా మార్చి 12న పోలింగ్ మెటీరియల్, బాక్సుల పంపిణీ జరుగుతుందన్నారు. మార్చి 13న ఎన్నికలు సజావుగా జరిగేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎన్నికల నిర్వహణపై ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు తొలివిడత శిక్షణ పూర్తయిందని, రెండోవిడత శిక్షణ ఈనెల 9న నిర్వహిస్తామన్నారు. ఎన్నికల నిర్వహణలో తీసుకోవాల్సిన పలు అంశాలపై ఆర్డీఓ ఎం.ఎస్.మురళి తహసీల్దార్ సీకే శ్రీనివాసులుకు పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో హెచ్ఎం రెడ్డన్నశెట్టి, ఆర్ఐ రెడ్డెప్ప, సర్వేయర్ ముబారక్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సూర్యప్రభ వాహనంపై శ్రీనారసింహుడు



సూర్యప్రభ వాహనంపై స్వామివారి ఊరేగింపు

గుర్రంకొండ: మండలంలోని తరిగొండ గ్రామంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని సూర్యప్రభ వాహనంపై ఊరేగించారు. స్వామివారి బ్రహోత్సవాల్లో భాగంగా ఎనిమిదవ రోజైన మంగళవారం వేకువజామునే మూలవర్లకు శుద్ధి తోమాల సేవ, తిరుచ్చి ఉత్సవం నిర్వహించారు. స్వామివారి వాహనమండపంలో రంగురంగుల పుష్పాలతో అలంకరించిన సూర్యప్రభ వాహనంపై స్వామివారిని కొలువుదీర్చారు. మేళతాళాలతో భాజాభజంత్రీలతో గ్రామ పురవీధుల గుండా స్వామివారి ఊరేగింపు సాగింది. మధ్యాహ్నం స్వామివారి మండపంలో మూలవర్లకు ఊంజల్‌సేవ నిర్వహించారు. టీటీడీ కళాకారుల కోలాటాలు, చెక్కభజనలు నడుమ రంగరంగ వైభవంగా ఊరేగింపు సాగింది.

## ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు సద్వినియోగం చేసుకోండి

కలకడ : ప్రభుత్వం ఉచితంగా అందించే ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలను గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ కిషోర్‌కుమార్‌రెడ్డి కోరారు. మంగళవారం మండలంలోని కె.దొడ్డిపల్లె పంచాయతీలో నిర్వహించిన ఫ్యామిలీ ఫిజిషియన్ వైద్య సేవల్లో పాల్గొని వైద్యసేవలు అందించారు. మాతశిశు మరణాలు జరగకుండా రక్త పరీక్షలు చేయించుకుని అవసరమైన వారు, రక్తం తక్కువగా ఉన్న వారు ఆసుపత్రిలో చేరాలని కోరారు. 123 మందికి సాధారణ చికిత్స చేయగా, 11 మంది గర్భిణులకు, ఐదుగురు బాలింతలకు చికిత్స చేశారు. ఎంపీహెచ్‌ఈఓ జయరామయ్య , సూపర్‌వైజర్ రెడ్డెమ్మ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అంగళ్లులో 17న సంత గేటు వేలం

కురబలకోట: మండలంలోని అంగళ్లు గొర్రెల సంత గేటు వేలం పాటలు ఈనెల 17న అంగళ్లు పంచాయతీ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు సర్పంచ్ పోరెడ్డి విశ్వారెడ్డి, కార్యదర్శి ఎంటీజీ ప్రసాద్ తెలిపారు. అదే రోజు టమాటా మార్కెట్, కూరగాయల వారపు సంత గేటు వేలం పాట కూడా నిర్వహించడం జరుగుతుందన్నారు. వేలంలో పాల్గొనదలచిన వారు ముందుగా రూ. 5 లక్షలు డిపాజిట్టు చెల్లించాల్సి ఉంటుందన్నారు.

# మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

వాల్మీకిపురం : సమాజంలో మహిళలు అన్ని రంగాలల్లో రాణించాలని సీడీపీవో భారతి అన్నారు. మంగళవారం స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళా సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఉమా అమరేశ్వరి మహిళలను ఉద్దేశించి మాట్లాడుతూ సమాజంలో మహిళలు ధైర్యంతో ఆత్మవిశ్వాసంతో నడుచుకోవాలన్నారు. గృహహింస చట్టంపై కూడా అవగాహన కలిగి ఉండాలన్నారు. అలాగే సమగ్ర బాలల సంరక్షణ పథకం గురించి మహిళలకు వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీదేవి, సూపర్‌వైజర్లు రోహిణి కుమారి, విజయకుమారి, దుర్గా పాల్గొన్నారు.

పీలేరు : మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని కల్లూరు ఏఎస్ఐ జ్యోతిరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ఎంజేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆమె మాట్లాడుతూ సమాజంలో మహిళల పట్ల వివక్షత చూపరాదన్నారు. మహిళ ఒక తల్లిగా, ఒక చెల్లిగా, ఒక తోడు నీడగా ఆమె పాత్ర అనితర సాధ్యమని పేర్కొన్నారు. అలాగే సంజయ్‌గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోనూ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు.

**మహిళలు ఆర్థిక స్వావలంభన సాధించాలి**

మదనపల్లె సిటీ: మహిళలు ఆర్థికంగా స్వావలంభన సాధించినప్పుడే మహిళా చైతన్యం సాధ్యమని మహిళా డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణవేణి అన్నారు. మంగళవారం ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా వాసవీ క్లబ్ సభ్యులు వంటల పోటీలు, ఆటల పోటీలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. విద్యార్థి దశ నుంచే మంచి అలవాట్లు నేర్చుకోవడం ద్వారా విజయాలు సాధించవచ్చునన్నారు. అడ్వకేట్ మీనాకుమారి, లీగల్ పారా వలంటీర్ సుభద్ర, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

## ఉచిత కంటివైద్య శిబిరానికి స్పందన

నిమ్మనపల్లె : నిమ్మనపల్లె ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మంగళవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జులేఖాబేగం సహకారంతో మదనపల్లె లయన్స్ కంటి ఆస్పత్రి, ఐటెల్ గ్రూప్ ఆధ్వర్యంలో ఉచిత కంటివైద్య శిబిరాన్ని నిర్వహించారు. కంటివైద్యులు అనిల్‌కుమార్ 80 మంది రోగులకు కంటిపరీక్షలు చేశారు. కార్యక్రమంలో లయన్స్ కంటి ఆస్పత్రి సిబ్బంది అంజిరెడ్డి, షఫీ, రెడ్డెప్ప, ఎంపీహెచ్‌ఈఓ రామచంద్ర, పీహెచ్‌ఎన్ సరోజ, సూపర్‌వైజర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

## టీబీ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం

కేవీపల్లె : టీబీ వ్యాధి గ్రస్తులకు నిక్షయమిత్ర కార్యక్రమంతో పౌష్టికాహారం అందిస్తున్నట్లు గ్యారంపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఉదయ్‌కుమార్ అన్నారు. మంగళవారం టీబీ వ్యాధిగ్రస్తులకు అవగాహన కల్పించడం తోపాటు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీబీ కేసులను దత్తత తీసుకుని మంచి పౌష్టికాహారం అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఆశాడే నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ పావనిగౌరి, పీహెచ్‌ఎన్ రెడ్డెమ్మ, హెచ్ఎస్ శ్యామల, ఎంపీహెచ్‌ఈవో రేఖానాయక్, సబ్ యూనిట్ అధికారి రామలింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పేర్నాటిని గెలిపించుకుందాం

బి.కొత్తకోట: తూర్పు పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని గెలిపించుకోవాలని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన బి.కొత్తకోట, కురబలకోట, తంబళ్లపల్లె మండలాల్లో పట్టభద్రుల ఓటర్లను కలిసి ప్రచారం నిర్వహించారు. సర్పంచు పోరెడ్డి విశ్వారెడ్డి, వక్ఫ్‌బోర్డు సభ్యులు ఫజురుల్లా, మైనుద్దీన్, చౌడేశ్వర, విజయకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

**పేర్నాటి విజయానికి కృషి చేయాలి**

నిమ్మనపల్లె: తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి విజయానికి కృషి చేయాలని ఎమ్మెల్యే ఎం.నవాజ్‌బాషా అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన నిమ్మనపల్లెలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంపై నాయకులు, సచివాలయ కన్వీనర్లు ప్రజాప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

## గడువులోగా రుణాల పంపిణీ పూర్తి చేయండి

పీలేరు : రుణాల పంపిణీ గడువులోపు పూర్తి చేయాలని జిల్లా లీడ్‌బ్యాంక్ మేనేజర్ వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. జిల్లాలో 10546 స్వయం సహాయక సంఘాలకు గానూ రూ. 830 కోట్లు లక్ష్యం పెట్టుకున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు రూ. 733 కోట్లు పంపిణీ చేసినట్లు చెప్పారు. జగనన్నతోడు పథకంలో 10722 మంది గానూ ఇప్పటి వరకు 5746 మందికి రుణాలు ఇచ్చినట్లు తెలిపారు.

# నరసింహ స్వామి ఆలయంలో పూజలు



మడుగు తేరును లాగుతున్న భక్తులు

పెద్దతిప్పసముద్రం: కదిరి పౌర్ణమి సందర్భంగా మంగళవారం మండలంలోని మల్లెల పంచాయతీ గొందిపల్లి సమీపంలోని శ్రీ కదిరి దేవుని గుట్టలో వెలసిన లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అభిషేకాలు, పూజలు నిర్వహించి స్వామి వారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. భక్తులకు భోజన సౌకర్యం కల్పించారు. రాత్రికి కోలాటం, చెక్క భజనలతో పాటు స్వామి వారి లడ్డూను వేలం నిర్వహిస్తామని నిర్వాహకులు పేర్కొన్నారు. అదే విధంగా మండల కర్ణాటక సరిహద్దులోని శ్రీ క్షేత్రం తిరుమలాపురంలో వెలసిన నరసింహస్వామి ఆలయంలో మడుగు తేరు, పున్నమి రథోత్సవం వేలాది మంది భక్తుల నడుమ కన్నుల పండుగగా నిర్వహించారు. ఈ నెల 8న పార్వేటోత్సవం, 9న వసంతోత్సవం, శయనోత్సవం, 10న స్వామి వారి సుప్రభాత సేవతో ఉత్సవాలు ముగుస్తాయని నిర్వాహకులు పేర్కొన్నారు.

**సింహవాహనంపై లక్ష్మీనరసింహుడు**

పెద్దమండ్యం: మండలంలోని పాపేపల్లెలో కుషావతీ నది ఒడ్డున ఏకశిలగుట్టపై వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం సింహవాహనంపై స్వామివారిని ఊరేగించారు. అలాగే గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు.



